
సాక్షి బాపట్ల
శనివారం । 30 । ఆగస్టు । 2025



పులిచింతల ప్రాజెక్టు సమాచారం

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ నుంచి 2,41,566 క్యూసెక్కులు వచ్చి చేరుతుండగా ప్రాజెక్టు దిగువకు 2,42,132 క్యూసెక్కులు వదులుతున్నారు.



పశ్చిమ డెల్టాకు నీటి విడుదల

దుగ్గిరాల: విజయవాడ ప్రకాశం బ్యారేజ్ నుంచి పశ్చిమ డెల్టాకు 4,513 క్యూసెక్కులు శుక్రవారం విడుదల చేసినట్లు నీటి పారుదల శాఖ అధికారులు తెలిపారు.

ఇన్‌చార్జి ప్రభుత్వ న్యాయవాదిగా ఫారూఖ్

గుంటూరు లీగల్: ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ప్రస్తుతం లేబర్ కోర్టు అసిస్టెంట్ గవర్నమెంట్ న్యాయవాది (ఏజీపీ)గా ఉన్న షేక్ ఫారూఖ్ ఇన్‌చార్జి ప్రభుత్వ న్యాయవాదిగా నియమితులయ్యారు.



న్యూస్‌రీల్

ముగిసిన డీఎస్సీ సర్టిఫికెట్ల పరిశీలన



గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరులోని ఏసీ కళాశాలలో రెండు రోజులపాటు జరిగిన డీఎస్సీ–2025 సెలెక్టెడ్ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియ శుక్రవారం ముగిసింది. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ప్రభుత్వ, జెడ్పీ, మున్సిపల్ పాఠశాలల్లో భర్తీ చేసేందుకు నిర్ణయించిన 1,143 పోస్టులతోపాటు జోనల్ స్థాయిలో గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల పరిధిలో ఉన్న మోడల్, ఆశ్రమ, సాంఘిక సంక్షేమ పాఠశాలల్లోని 572 పీటీజీ, టీజీటీ, పీడీ, పీఈటీ పోస్టులవారీగా అభ్యర్థులకు సంబంధించిన సర్టిఫికెట్ల పరిశీలన ముగిసింది. గురువారం 930 మందికి సంబంధించి పరిశీలన పూర్తి కాగా, శుక్రవారం జోనల్‌స్థాయి పోస్టులకు ఎంపికైన అభ్యర్థులవి పరిశీలించారు. రెండు రోజుల వ్యవధిలో 1,650 మందికి పైగా అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన పూర్తయింది. ఈ ప్రక్రియను ఆర్జేడీ బి.లింగేశ్వరరెడ్డి, పరిశీలకురాలు పి.శైలజ, డీఈవోలు సీవీ రేణుక, చంద్రకళ, పురుషోత్తంలు పర్యవేక్షించారు.

డీడీగా విధుల్లో చేరిన పాల్ సుధాకర్



గుంటూరు మెడికల్: గుంటూరు ప్రాంతీయ వైద్య ఆరోగ్య శాఖ సంచాలకులు (ఆర్డీ) కార్యాలయం డెప్యూటీ డైరెక్టర్‌గా బండి పాల్ సుధాకర్ శుక్రవారం విధుల్లో చేరారు. గుంటూరు ఆర్డీగా పనిచేస్తున్న గుర్రం శ్రీనివాసులు రెడ్డి జేడీగా పదోన్నతి పొంది విజయవాడ డీఎంఈ కార్యాలయానికి బదిలీ కావడంతో ప్రభుత్వం పాల్ సుధాకర్‌ను డీడీగా నియమించింది. విధుల్లో చేరిన పాల్ సుధాకర్ ఆర్డీ డాక్టర్ శోభారాణిని కలిసి జాయినింగ్ రిపోర్టు అందజేశారు. డీడీగా విధుల్లో చేరిన పాల్ సుధాకర్‌ను కార్యాలయం సూపరింటెండెంట్లు సత్యం, రామకృష్ణ, సీనియర్ అసిస్టెంట్లు, పలువురు కార్యాలయ ఉద్యోగులు, పలువురు వైద్యులు, వైద్య సిబ్బంది అభినందించారు.

ఏషియన్ షూటింగ్ పోటీల్లో ముఖేష్‌కు పతకాల పంట



గుంటూరు వెస్ట్ (క్రీడలు): కజకిస్తాన్‌లోని షెమ్కెంట్‌లో జరుగుతున్న ఏషియన్ షూటింగ్ చాంపియన్ షిప్‌లో గుంటూరుకు చెందిన షూటర్ నేలవల్లి ముఖేష్ పతకాల పంట పండించాడు. శుక్రవారం జరిగిన ఫైనల్లో 50 మీటర్ల ఫ్రీ పిస్టల్, 25 మీటర్ల స్టాండర్డ్ పిస్టల్ , 25 మీటర్ల స్పోర్ట్స్ పిస్టల్ టీమ్ విభాగాల్లో 3 బంగారు పతకాలు, 25 మీటర్ల స్పోర్ట్స్ పిస్టల్ వ్యక్తిగత విభాగంలో కాంస్య పతకం సాధించాడు. భారత్ జూనియర్ జట్టులో సభ్యుడైన ముఖేష్ కొన్ని సంవత్సరాలుగా జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో నిలకడగా రాణిస్తున్నాడు. రాష్ట్రంలో ఈ ఘనత సాధించిన తొలి వ్యక్తిగా అరుదైన రికార్డును సైతం నెలకొల్పాడు. ఈ సందర్భంగా ముఖేషను రైఫిల్ అసోసియేషన్ ఇండియా అధ్యక్ష, కార్యదర్శులు సలలిత్, రాజ్ కుమార్‌తోపాటు కేఎల్ యూనివర్సిటీ స్పోర్ట్స్ డీన్ హరికిషోర్‌లు అభినందించారు.

ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం



నరసరావుపేట ఈస్ట్: సత్తెనపల్లి రోడ్డు కోటబజార్‌లో పునర్నిర్మాణం జరుపుకుంటున్న వీరాంజనేయ సహిత యోగానంద లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి పట్టణానికి చెందిన కొండేపాటి మంగేశ్వరరావు, సామ్రాజ్యం దంపతులు రూ.లక్ష విరాళంగా అందించారు. ఆలయంలో శుక్రవారం పూజలు నిర్వహించిన మంగేశ్వరరావు దంపతులు విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులకు అందించారు. కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు కోవూరి శివశ్రీనుబాబు, వనమా సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

సిండికేట్‌ల మాయాజాలం

మద్యం అమ్మకాలు పెంచి ఆదాయం పెద్ద ఎత్తున సమకూర్చుకునేందుకు కూటమి సర్కారు నిర్ణయించింది. అందుకుగాను బార్‌లకు తలుపులు బార్లా తెరిచింది. బార్ల సంఖ్యను పెంచింది. మద్యం అమ్ముకునేందుకు సమయం పెంచింది. అయినా ప్రభుత్వం ఆశించిన స్పందన కనిపించలేదు. దరఖాస్తు గడువు పెంచింది. కానీ దరఖాస్తు చేసేందుకు ఎవ్వరూ ముందుకు రావడం లేదు. కూటమికి చెందిన మద్యం వ్యాపారులు సిండికేట్ అయ్యారు. లైసెన్స్ ఫీజు మరింత తగ్గించుకునే కుట్రలో భాగంగానే దరఖాస్తు చేయడం లేదని సమాచారం. శుక్రవారం అర్ధరాత్రితో దరఖాస్తు దాఖలు గడువు ముగియనుండడంతో ఎక్సైజ్ అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

- 19 కొత్త బార్లకు నోటిఫికేషన్
- శుక్రవారం నాటికి నాలుగు బార్లకే దరఖాస్తులు
- ఒక్కొక్క బార్‌కు నాలుగు దరఖాస్తులు వస్తేనే లాటరీ
- గడువు పొడిగించినా స్పందన కరువు
- డిపాజిట్లు తగ్గించుకొనే ఎత్తుగడలో సిండికేట్లు

జిల్లాలో బార్ లైసెన్సులకు స్పందన అంతంతమాత్రమే



సాక్షి ప్రతినిధి,బాపట్ల: బాపట్ల జిల్లాలో గతంలో 17 బార్‌లకు లైసెన్స్‌లు ఉండేవి. ఆ సంఖ్యను ప్రభుత్వం 19కి పెంచింది. జనరల్ కేటగిరీలో చీరాలకు ఏడు, బాపట్లకు ఐదు, రేపల్లెకు నాలుగు, అద్దంకికి ఒకటి చొప్పున 17 బార్‌లు కేటాయించిన ప్రభుత్వం గీత కార్మికులకు బాపట్ల, రేపల్లెల్లో ఒక్కొక్కటి చొప్పున రెండు కేటాయించింది. శుక్రవారం రాత్రికి బాపట్ల, రేపల్లెలలో గీత కార్మికులకు కేటాయించిన రెండు బార్లతోపాటు జనరల్ కేటగిరీలోని అద్దంకి, చీరాలల్లోని ఒక్కొక్కటి చొప్పున మరో రెండు బార్లకు మాత్రమే దరఖాస్తులు వచ్చాయి. అద్దంకిలోని బార్‌కు ఏడు దరఖాస్తులు రాగా చీరాలలో ఒక బార్‌కు నాలుగు దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. గీత కార్మికులకు సంబంధించి రెండు బార్లకు చెరో నాలుగు దరఖాస్తులు వచ్చాయి. చీరాలలోని మిగిలిన ఆరు బార్లకు, బాపట్లలోని ఐదు, రేపల్లెలోని నాలుగు బార్‌లకు ఒక్క దరఖాస్తు కూడా రాలేదు. శుక్రవారం అర్ధరాత్రి వరకూ గడువు ఉండడంతో మరి కొన్ని దరఖాస్తులు వచ్చే అవకాశముందని ఎక్సైజ్ అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. బార్‌ల కోసం దరఖాస్తు ఫీజును రూ.5 లక్షలుగా నిర్ణయించారు. ఒక్కొక్క బార్‌కు నాలుగు దరఖాస్తులు వస్తేనే లాటరీ పద్ధతిలో కేటాయించేలా నిబంధనలు పెట్టారు. ఇక జనరల్ కేటగిరీలోని అద్దంకి మినహా మిగిలిన బార్‌లకు ఏడాదికి రూ.55 లక్షలు లైసెన్స్ ఫీజుగా నిర్ణయించి ఈ మొత్తాన్ని ఏడాదిలో ఆరు విడతలుగా చెల్లించేలా నిబంధన పెట్టారు. అద్దంకి బార్‌కు మాత్రం రూ.35 లక్షల ఫీజుగా నిర్ణయించిన ప్రభుత్వం గీత కార్మికులకు కేటాయించిన రెండు బార్‌లకు దరఖాస్తు ఫీజు రూ.5 లక్షలు పెట్టి లైసెన్సు ఫీజును మాత్రం ఒక్కొక్క దానికి రూ.27.50 లక్షలుగా నిర్ణయించారు.

ఆదాయం పెంచుకునేందుకే సిండికేట్

బార్‌లలో ఆదాయం పెంచుకునేందుకు కూటమి మద్యం వ్యాపారుల సిండికేట్ బార్‌లకు దరఖాస్తులు చేసేందుకు ముందుకు రాలేదని తెలుస్తోంది. లైసెన్సు ఫీజును మరింతగా తగ్గించుకునే ఎత్తుగడలో భాగంగానే మద్యం వ్యాపారులు ఈ వ్యూహం అమలు చేస్తున్నట్లు సమాచారం. వాస్తవానికి ఆగస్టు 18న ప్రభుత్వం జనరల్ కేటగిరీలోని బార్‌లకు, 20న గీత కార్మికుల బార్‌ల ఏర్పాటుకు నోటిఫికేషన్ ఇవ్వగా 26 తేదీ గడువు ముగిసే నాటికి ఒక్క దరఖాస్తు కూడా రాలేదు. దీంతో 29 వరకూ గడువు పొడగించారు. అయినా 19లో నాలుగు బార్‌లకు మాత్రమే దరఖాస్తులు రాగా మిగిలిన 15 బార్లకు ఒక్క దరఖాస్తు రాలేదు. మద్యం వ్యాపారులు ఉద్దేశపూర్వకంగానే దరఖాస్తులు వేయలేదని తెలుస్తోంది.

తలలు పట్టుకుంటున్న ఎక్సైజ్ అధికారులు

బార్‌లకు దరఖాస్తులు, లాటరీ, లైసెన్సుల వ్యవహారాలను సజావుగా పూర్తిచేసే బాధ్యతలను ప్రభుత్వం ఎక్సైజ్ అధికారులపై పెట్టింది. కానీ సిండికేట్‌గా మారి లైసెన్సు ఫీజు తగ్గించుకోవాలనుకుంటున్న మద్యం వ్యాపారులు ఉద్దేశపూర్వకంగానే దరఖాస్తులు వేయక పోవడంతో వ్యవహారం ఎక్సైజ్ అధికారుల మెడకు చుట్టుకుంది. ఎలాగైనా అన్ని బార్లకు దరఖాస్తులు వచ్చేలా చూడాలని ఇప్పటికే ఎక్సైజ్ ఉన్నతాధికారులు స్థానిక అధికారులకు అల్టిమేటం జారీ చేశారు. దీంతో జిల్లా ఎక్సైజ్ అధికారులు మాత్రం మద్యం అధికారులను పదేపదే కోరినా వారి మనస్సు కరగలేదు. అధికారులు ఎన్ని ప్రయత్నాలు చేసినా దరఖాస్తులు రాకపోవడంతో వారు తలలు పట్టుకుంటున్నారు.

దేశ భాషలందు తెలుగు లెస్స

జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి



గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి, అధికారులు

బాపట్ల: దేశ భాషలందు తెలుగు లెస్స, తెలుగు భాషను బతకనిద్దాం, గౌరవిద్దామని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. గిడుగు రామ్మూర్తి జయంతి, తెలుగు భాషా దినోత్సవం శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో నిర్వహించారు. గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి కలెక్టర్ పూలమాలవేసి నివాళులర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ వ్యవహారిక తెలుగు భాష మరింత వినియోగంలోకి తీసుకురావాలని ఉద్యమం చేసిన గొప్ప చారిత్రాత్మక వ్యక్తి రామ్మూర్తి అని ప్రశంసించారు. తెలుగు భాషకు బాపట్ల జిల్లా పుట్టినిల్లు అని పేర్కొన్నారు. తెలుగు భాష కోసం గిడుగు రామ్మూర్తి చేసిన త్యాగాలు మరువలేనివని ఇన్‌చార్జి సంయుక్త కలెక్టర్, డీఆర్ఓ జి.గంగాధర్ గౌడ్ అన్నారు. తెలుగు భాషకు వెలుగు లాంటి వ్యక్తి గిడుగు రామ్మూర్తి అని బెటర్ ఫర్ బాపట్ల కార్యదర్శి పి సి సాయిబాబు అన్నారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఏఓ మల్లికార్జునరావు, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

బాపట్ల అర్బన్: ప్రపంచ భాషలన్నింటిలోకెల్లా తెలుగు అత్యంత మధురమైనదని బాపట్ల ఆర్డీఓ పీ గ్లోరియా అన్నారు. తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఫోరం ఫర్ బెటర్ బాపట్ల ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తొలుత తెలుగు తల్లి విగ్రహానికి, గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మోదుగుల శ్రీరామ్‌రెడ్డి డిగ్రీ కళాశాల విద్యార్థులు 'తెలుగు తల్లి' గీతాన్ని ఆలపించారు. కార్యక్రమంలో ఫోరం కార్యదర్శి డాక్టర్ పి సి సాయిబాబు, తహసీల్దార్ షేక్ సలీమా, మున్సిపల్ డీఈ కృష్ణారెడ్డి, చిత్రకారుడు జీవి, కళాశాల అధ్యాపకుడు హనుమాన్లు, నాయకులు కర్పూరపు రామారావు పాల్గొన్నారు.

ధననాథుడు...



కాకతీయనగర్‌లోని శ్రీసాయిరామ్ టవర్స్ అపార్ట్‌మెంట్‌లో ఏర్పాటు చేసిన గణపతి మండపంలో గణనాథుడిని శుక్రవారం కరెన్సీ నోట్లతో విశేషంగా అలంకరించారు. దాదాపు రూ.22 లక్షల విలువైన నోట్లతో గణనాథుడు, మండపాన్ని అలంకరించినట్లు నిర్వాహకులు తెలిపారు.

-నరసరావుపేట ఈస్ట్

శాంతించిన కృష్ణమ్మ



కొల్లూరు మండలం పోతార్లంక సమీపంలో వరద నీటిలో అరటి తోట

కొల్లూరు: కృష్ణమ్మ శాంతించింది. నదీ తీర గ్రామాల వాసులు ఊపిరి పీల్చుకున్నారు. ప్రకాశం బ్యారేజ్ నుంచి గురువారం సముద్రంలోకి విడుదల చేస్తున్న వరద నీటి పరిమాణం పెరగడంతో నదిలో నీటిమట్టం అర్ధరాత్రి నుంచి క్రమక్రమంగా పెరిగి లోతట్టు ప్రాంతాలలోకి వరద నీరు చేరింది. 4.38 లక్షల క్యూసెక్కులు దిగువుకు విడుదల చేసిన కారణంగా మండలంలోని పోతార్లంక, గాజుల్లంక, చింతర్లంక గ్రామాల పరిధిలో సాగు చేసిన వాణిజ్య పంటలు వరద ముంపునకు గురయ్యాయి. మండలంలోని దోనేపూడి –పోతార్లంక గ్రామాల నడుమ ఉన్న లోలెవల్ వంతెనపై నుంచి వరద నీరు ప్రవహిస్తుండటంతో ఈ మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయి. ఎగువ నుంచి ప్రకాశం బ్యారేజ్‌కు వరద నీటి విడుదల తగ్గుతుండటంతో నీటిపారుదల శాకాధికారులు దిగువకు నీటి విడుదలను గణనీయంగా తగ్గించి శుక్రవారం సాయంత్రానికి 2.96 లక్షల క్యూసెక్కులు సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. బ్యారేజ్ నుంచి నీటి విడుదల తగ్గుముఖం పట్టడంతో మొదటి విడత ప్రమాద హెచ్చరికను అధికారులు ఉపసంహరించారు. నదిలో నీటి మట్టం తగ్గుముఖం పట్టడంతో నదీ పరివాహక ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



కొల్లూరు మండలం గాజుల్లంక -పోతార్లంక మధ్య కంద పంటలోకి చేరిన వరద నీరు

పర్యాటక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిద్దాం

- జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి
- 27న వేడుకలకు హాజరుకానున్న సీఎం

బాపట్ల: ప్రపంచ పర్యాటక దినోత్సవ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని వీక్షణ సమావేశ మందిరంలో రాష్ట్ర పర్యాటక శాఖ అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ సెప్టెంబర్ 27వ తేదీన ప్రపంచ పర్యాటక దినోత్సవ సందర్భంగా బాపట్లలోని సూర్యలంక బీచ్‌లో సెప్టెంబర్ 26, 27, 28 తేదీలలో బీచ్ వేడుకలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ వేడుకలను తిలకించేందుకు తెలుగు రాష్ట్రాల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యే అవకాశం ఉందని అన్నారు. తెలుగుదనం ఉట్టిపడేలా మూడు రోజుల పాటు కార్యక్రమాలు నిర్వహించాలని, ప్రతిరోజూ వివిధ రకాల కార్యక్రమాలు ఉండే విధంగా ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమాలు ప్రతి రోజూ ఉదయం తొమ్మిది నుంచి రాత్రి 9:30 గంటల వరకు నిర్వహిస్తారని తెలిపారు. బాపట్ల పట్టణంలోనూ, సూర్యలంక బీచ్ పరిసర ప్రాంతాలలో రద్దీ నియంత్రణకు చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. రామాపురం బీచ్‌లో కూడా మూడు రోజులపాటు సాంస్కృతిక, వినోద కార్యక్రమాలు నిర్వహిస్తామని కలెక్టర్ తెలిపారు. సెప్టెంబర్ 27వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు సూర్యలంక బీచ్‌కు వస్తారని తెలిపారు. కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ పోలీసులకు సూచించారు. పలు అభివృద్ధి కార్యక్రమాలకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేస్తారని తెలిపారు. అనంతరం వేడుకల ఏర్పాట్లు, వాహనాల పార్కింగ్ స్థలాలను కలెక్టర్ జె వెంకట మురళి, ఎస్పీ తుషార్ డూడీ, రాష్ట్ర పర్యాటక శాఖ అధికారులు పరిశీలించారు. సమావేశంలో ఇన్‌చార్జి సంయుక్త కలెక్టర్ జి గంగాధర్‌గౌడ్, రాష్ట్ర పర్యాటక శాఖ డిప్యూటీ సీఈఓ శ్రీనివాసరావు, పర్యాటక శాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు లక్ష్మీ ప్రసన్న, బాపట్ల పర్యాటక శాఖ అధికారి నాగిరెడ్డి, డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు, డీపీఓ ప్రభాకర్, బాపట్ల ఆర్డీఓ గ్లోరియా, మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సూర్యలంక బీచ్‌ను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్, ఎస్పీ, అధికారులు

రెవెన్యూ సేవలు సత్వరం అందించండి

చీరాల ఆర్డీవో తూమాటి చంద్రశేఖర నాయుడు



డివిజనల్ రెవెన్యూ అధికారులకు సూచనలు చేస్తున్న ఆర్డీఓ చంద్రశేఖర నాయుడు

చీరాల టౌన్: రెవెన్యూ సమస్యల పరిష్కారంలో అశ్రద్ధ వద్దని.. వచ్చిన ప్రతి అర్జీని నిశితంగా విచారణ చేయించాలని చీరాల ఆర్డీవో తూమాటి చంద్రశేఖర నాయుడు సూచించారు. శుక్రవారం చీరాల ఆర్డీవో కార్యాలయంలో చీరాల రెవెన్యూ డివిజన్ పరిధిలోని తహసీల్దార్లు, మండల సర్వేయర్లు, రీ సర్వే డీటీలతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. డివిజన్ పరిధిలోని మండలాల వారీగా పెండింగ్‌లో ఉన్న రెవెన్యూ సమస్యలు, రీ సర్వే, పీజీఆర్ఎస్ అర్జీలు, ప్రజా ప్రతినిధుల నుంచి వచ్చిన అర్జీలు, ల్యాండ్ కన్వర్షన్, నీటి తీరువా వసూళ్లపై మాట్లాడి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ మండలాల వారీగా అర్హత ఉండి నివేశన స్థలాలు రాని వారి వివరాల నివేదికలు అందించడంతో పాటు కావాల్సిన భూమి వివరాలు అందించాలన్నారు. మండలాల్లో నీటి తీరువా వసూళ్లకు ప్రత్యేక డ్రైవ్ ఏర్పాటు చేసి రైతుల నుంచి విధిగా నీటి తీరువా వసూళ్లు చేయాలన్నారు. రీ సర్వే పకడ్బందీగా చేసి రికార్డుల ప్రకారమే వివరాలను ఆన్‌లైన్ చేయాలన్నారు. రెవెన్యూ సమస్యలను సత్వరంగా పరిష్కరించాలని సూచించారు. అర్జీదారులకు నిర్ణీత సమయంలోగా అర్జీలు విచారించి పరిష్కారం చూపాలన్నారు. అర్జీదారులను కార్యాలయాల చుట్టు తిప్పుకోవద్దని ప్రజలకు సత్వరంగా సేవలందిస్తే మంచి అధికారులుగా గుర్తింపు వస్తుందన్నారు. ప్రజలకు జవాబుదారీతనంగా రెవెన్యూ ఉద్యోగులు పనిచేయాలని, విధుల్లో అలసత్వం వహించిన వారిపై శాఖా పరమైన చర్యలు తప్పవన్నారు. గ్రామాల వారీగా పెండింగ్‌లో ఉన్న పట్టాదారు పాస్ పుస్తకాలను త్వరగా అందించడంతో పాటు గ్రామాల్లో ఎక్కడా కూడా అనధికార లేఅవుట్లు వేయకుండా కట్టడి చేయాలన్నారు. ఓటీసీలను త్వరగా మంజూరు చేయాలన్నారు. సమావేశంలో డివిజనల్ సర్వే ఇన్‌స్పెక్టర్ ముసలయ్య, తహసీల్దార్లు గోపికృష్ణ, ప్రభాకరరావు, నాగరాజు, రీసర్వే డీటీలు, మండలాల సర్వేయర్లు బసవాచారి, శ్రీను. లోకేష్, ఇతర రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రూ. 6.40 లక్షలు పలికిన ఆనంద్‌పేట లడ్డూ



లడ్డూను దక్కించుకున్న ఇగుటూరి రాజశేఖర్‌రెడ్డి

రెంటచింతల: స్థానిక ఆనంద్‌పేట కాలనీలో ఏర్పాటు చేసిన వినాయకుడి మండపం వద్ద 90 కేజీల లడ్డూను, 30 గ్రాముల వినాయక స్వామి వారి బంగారు లాకెట్‌ను ఇగుటూరి రాజశేఖర్‌రెడ్డి రూ. 6.40 లక్షలకు వేలంపాటలో దక్కించుకున్నారు. సుమారు రెండు గంటల పాటు ఊరేగింపు కొనసాగింది. ప్రధాన రహదారిపై ఆనంద్‌పేట యువత కేరింతలు పెట్టారు. వందల మంది భక్తులు తరలి వచ్చారు. గత ఏడాది లడ్డూను గొంటు ఆదిరెడ్డి రూ. 7.10 లక్షలకు దక్కించుకున్నారు.

రూ. మూడు లక్షలకు పైగా ధర పలికిన లడ్డూ

పెదకాకాని: మండలంలోని వెనిగండ్ల గ్రామంలో గురువారం రాత్రి వినాయక లడ్డూ వేలం నిర్వహించారు. వేమారెడ్డి గుడి సెంటర్‌లో రెడ్డి యూత్ ఏర్పాటు చేసిన వినాయక విగ్రహానికి బుర్రముక్కల శ్రీనివాసరెడ్డి 25 కిలోల లడ్డూ, తియ్యగూర శ్రీ ప్రియాంక రెడ్డి 20 కిలోల లడ్డూ, పులగం వేమారెడ్డి 11 కిలోల లడ్డూ సమర్పించారు. వేలంలో అబ్బులు(ఆత్మకూరి శేషిరెడ్డి) యువసేన 25 కిలోల లడ్డూను రూ.3,01,116లకు దక్కించుకుంది. 20 కిలోల లడ్డూ రూ.40 వేలకు, 11 కిలోల లడ్డూ రూ.40 వేలకు భక్తులు దక్కించుకున్నారు. అనంతరం వినాయక విగ్రహాన్ని నిమజ్జనానికి తరలించారు.

ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొట్టిన లారీ



ట్రాక్టర్‌ను ఢీకొట్టిన లారీ

నలుగురు కూలీలకు తీవ్ర గాయాలు

బల్లికురవ: సుబాబుల్ కర్ర లోడ్ ట్రాక్టర్‌ను వెనుక నుంచి గ్రానైట్ లారీ ఢీకొట్టడంతో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన శుక్రవారం రాత్రి బల్లికురవ– సంతమాగులూరు ఆర్అండ్‌బీ రోడ్డులోని కొత్త మల్లాయపాలెం బస్‌స్టాప్ సమీపంలో జరిగింది. బల్లికురవ ఎస్సీ కాలనీకి చెందిన బత్తిని చిన సుబ్బయ్య కూలీలతో మల్లాయపాలెం గ్రామ సమీపంలో సుబాబుల్ కర్ర కొట్టించుకుని ట్రాక్టర్‌కు లోడ్ చేసుకుని రోడ్ మార్జిన్‌లో ఆగాడు. కూలీలు ట్రాక్టర్‌కు లోడ్ ఎత్తుతుండగా వెనుక నుంచి ఈర్లకొండ క్వారీలకు వెళుతున్న గ్రానైట్ లారీ ట్రక్కును ఢీకొంది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్ మార్జిన్‌లోకి వెళ్లగా సుబాబుల్ కర్ర రోడ్డుపై చెల్లాచెదురుగా పడ్డాయి. ఈ విషయం తెలుసుకున్న బల్లికురవ ఎస్సై వై.నాగరాజు హుటాహుటిన ఘటనా ప్రదేశానికి సిబ్బందితో వెళ్లారు. సుబాబుల్ కర్రలను పక్కకు తీయించి ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టారు.



రోడ్డుపై చెల్లాచెదరుగా పడిన సుబాబుల్ కర్ర

ఇంటికి వెళ్లే సమయానికి..

పొట్ట కూటి కోసం సుబాబుల్ కర్ర కొట్టేందుకు కూలి పనులకు వెళ్లి అరగంటలో ఇంటికి చేరేలోపే నలుగురు గాయాల పాలయ్యారు. జొన్నలగడ్డ మేరమ్మ, పందిరి చిన సుబ్బయ్య, కొత్తపల్లి యేసమ్మ, గంధం మేరమ్మలను చికిత్స నిమిత్తం నరసరావుపేటలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు.



గాయాలపాలైన పేరమ్మ



పసుపు ధరలు
(శుక్రవారం)

యార్డుకు వచ్చిన బస్తాలు : 72

కొమ్ములు : 51 బస్తాలు

(ధర రూ॥ల్లో)

కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
8,500	9,050	9,050

కాయలు : 21 బస్తాలు

కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
8,500	10,325	10,325

మొత్తం అమ్మకాలు : 54.00 క్వింటాళ్లు

–దుగ్గిరాల

మిర్చి యార్డు సమాచారం
(శుక్రవారం ధరలు)



వచ్చిన బస్తాలు	36,246
అమ్మకాలు	41,057
నిల్వ	5,504

నాన్ ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	10,000–14,200
నంబరు–5	10,000–13,500
341	10,000–15,200

ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	10,000–14,000
నంబరు–5	10,000–13,600
341	11,000–15,500
4884	10,000–13,500

నాన్ ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

షార్క్–1	10,000 – 15,200
సంగీ బాడిగ 5531	10,000 – 14,600
ఆర్మూర్	9,800 – 12,200
తాలుకాయలు	6,200 – 7,600

ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

షార్క్–1	10,000 – 15,300
సంగీ బాడిగ 5531	10,000 – 14,000
తాలు	5,400 – 7,300

–కొరిటెపాడు (గుంటూరు)

రసవత్తరంగా జాతీయ యోగా పోటీలు

చిలకలూరిపేటటౌన్/యడ్లపాడు: నవోదయ విద్యాలయ సమితి(ఎన్‌వీఎస్) ఆధ్వర్యంలో చిలకలూరిపేట రూరల్ మండలం మద్దిరాల పీఎంశ్రీ జవహర్ నవోదయ విద్యాలయం వేదికగా జరుగుతున్న జాతీయస్థాయి యోగా విన్యాసాల ప్రదర్శన పోటీలు రసవత్తరంగా సాగుతున్నాయి. భోపాల్, చండీఘర్, జైపూర్, హైదరాబాద్, లక్నో, పూనే, పాట్నా, షిల్లాంగ్ జేఎన్‌వీ రీజియన్ల పరిధిలోని ఒక్కొక్క రీజియన్ నుంచి బాలురు, బాలికలు 42 మంది చొప్పున 336 యోగాసాధకులు, టీంలీడర్, సంరక్షకులు హాజరయ్యారు. శుక్రవారం హైదరాబాద్ నవోదయ విద్యాలయ సమితి అసిస్టెంట్ కమిషనర్ డి చక్రపాణి రెండోరోజు పోటీల నిర్వహణను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు.



యోగా విన్యాసాల ప్రదర్శన పోటీకి సిద్ధమవుతున్న యోగాసాధకులు

వివిధ విభాగాల్లో ఉత్సాహంగా పోటీలు

అండర్–14, అండర్–17, అండర్–19 విభాగాల్లో బాలురు, బాలికలకు వేర్వేరుగా జాతీయస్థాయి యోగా పోటీలు నిర్వహిస్తున్నారు. వీటిలో యోగ ఆసనాలు, ఆర్టిస్టిక్ యోగా, రిథమిక్ యోగా వంటి కేటగిరీలతో పాటు, ఉత్తమ యోగి (బెస్ట్ యోగి), ఉత్తమ యోగిని (బెస్ట్ యోగినీ) వంటి ప్రత్యేక విభాగాల్లోనూ తీవ్రపోటీ నెలకొంది. తొలి రోజున బాలబాలికలు వివిధ ఆయా విభాగాల్లో అబ్బురపరిచే యోగా ప్రదర్శనలతో మెప్పించారు. రెండోరోజైన శుక్రవారం ఆర్టిస్టిక్ విభాగంలో అండర్–14, అండర్–17, అండర్–19 విభాగాల పోటీలు ఉత్సాహంగా కొనసాగాయి. పోటీలకు రాష్ట్ర ప్రభుత్వ, వివిధ అసోసియేట్స్‌కు చెందిన యోగా అఫీషియల్స్ 15 మంది వ్యవహరిస్తున్నారు. పోటీలను మద్దిరాల పీఎంశ్రీ జేఎన్‌వీ విద్యాలయ ప్రిన్సిపల్ నల్లూరి నరసింహరావు పర్యవేక్షణలో వైస్ ప్రిన్సిపల్ శ్రీనివాసరావు, పీఈటీలు ఆర్ పాండురంగారావు, జి గోవిందమ్మ, అధ్యాపకులు సహకారం అందించారు. జాతీయస్థాయి యోగా పోటీల ముగింపు సభ శనివారం మధ్యాహ్నం 12 గంటలకు నిర్వహించనున్నారు.

ప్రతి కుటుంబానికి బ్యాంకింగ్ సౌకర్యాలు

భారతీయ రిజర్వ్ బ్యాంక్ ఆంధ్రప్రదేశ్ రీజినల్ ఆఫీస్ జనరల్ మేనేజర్ మహానా



వేటపాలెం: ప్రజలందరికీ ఆర్థిక సేవలు చేరేలా ప్రభుత్వం కృషి చేస్తుందని భారతీయ రిజర్వ్ బ్యాంక్ ఆంధ్రప్రదేశ్ రీజనల్ ఆఫీస్ జనరల్ మేనేజర్ మహానా పేర్కొన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో జిల్లా లీడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో మూడు నెలల ఆర్థిక కేంద్ర ప్రయత్న శిబిరం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ప్రతి కుటుంబం బ్యాంక్ ఖాతా, డిజిటల్ లావాదేవీలు, బీమా, పెన్షన్, రుణ సౌకర్యాలు పొందేలా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. డిజిటల్ మోసాల నుంచి ఎలా రక్షించుకోవాలో తెలిపారు. క్రెడిట్ విభాగం చీఫ్ మేనేజర్ ఎం. సంపత్, ఫైనాన్షియల్ ఇన్‌క్లూజన్ నోడల్ ఆఫీసర్ మహేంద్ర, వెలుగు సీసీలు, యానిమేటర్లు పాల్గొన్నారు.

గొర్రెలను ఢీ కొన్న లారీ

రెండు మృతి.. మరికొన్నింటికి గాయాలు

మేదరమెట్ల: లారీ డ్రైవర్ మద్యం మత్తులో .. లారీని గొర్రెల మందపైకి నడపడంతో రెండు గొర్రెలు మృతి చెందగా మరో పది గొర్రెలకు కాళ్లు విరిగినట్లు బాధితుడు తెలిపాడు. హైదరాబాద్ నుంచి చెన్నైకు వెళుతున్న లారీ డ్రైవర్ మద్యం మత్తులో రోడ్డు మార్జిన్‌లో వెళుతున్న గొర్రెల మందపైకి నడిపాడు. కొరిశపాడు మండలంలోని మేదరమెట్ల పోలీసు స్టేషన్ సమీపంలో ఈ ప్రమాదం శుక్రవారం చోటు చేసుకుంది. మొత్తం రూ.2.50 లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు బాధితుడు వెంకటరామయ్య తెలిపారు.


మేదరమెట్ల జాతీయ రహదారి వద్ద గొర్రెలను ఢీ కొన్న లారీ

కారు ఢీకొని సైకిలిస్ట్ మృతి

- కారు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు
- జాతీయ రహదారిపై మృతుడి కుటుంబసభ్యుల ఆందోళన

భట్టిప్రోలు: అతి వేగంగా వస్తున్న కారు ఢీ కొట్టడంతో సైకిలిస్ట్ అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన శుక్రవారం భట్టిప్రోలు వద్ద జాతీయ రహదారిపై జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు.. భట్టిప్రోలు పంచాయతీ పరిధిలోని అద్దేపల్లికి చెందిన రంగిశెట్టి జయచంద్రరావు (55) వేమవరం సమీపంలోని ఎన్‌హెచ్ 216/ఎ జాతీయ రహదారి వెంబడి ఉన్న పొలం కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నాడు. పొలంలో శుక్రవారం నాట్లు వేస్తున్నారు. కూలీలకు తాగు నీరు తీసుకువచ్చేందుకు ఉదయం 10 గంటల సమయంలో సైకిల్‌పై బయలుదేరాడు. వెనుక నుంచి కారు అతి వేగంగా వచ్చిన కారు సైకిల్‌పై వెళుతున్న జయచంద్రరావును ఢీ కొట్టింది. అతను అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు, చుట్టుపక్కల వారు జాతీయ రహదారిపై ఆందోళనకు దిగారు. అక్కడికి చేరుకున్న ఎస్ఐ ఎం. శివయ్య ఫిర్యాదు చేస్తే విచారణ చేస్తామని తెలపడంతో ఆందోళన విరమించారు. గుంటూరుకు చెందిన కారు డ్రైవర్ నక్కా సురేంద్రను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మృతుడికి భార్య, ఇరువురు కుమార్తెలు ఉన్నారు. కుమార్తెలు వివాహాలు అయ్యాయి. భార్య అన్నపూర్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.


ఎన్ హెచ్ రహదారిపై మృతి చెందిన సైకిలిస్టు రంగిశెట్టి జయచంద్రరావు (55)

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి

గుంటూరు ఎడ్యుకేషన్ : ఆలిండియా పెన్షనర్స్ కో–ఆర్డినేషన్ కమిటీ పిలుపు మేరకు శుక్రవారం గుంటూరు కృష్ణనగర్ లోని ఉద్యోగుల భవిష్యనిధి (ఈపీఎఫ్) ప్రాంతీయ కార్యాలయం వద్ద పెన్షనర్స్ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్టీసీ గుంటూరు జిల్లా రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు పి. శేషగిరిరావు మాట్లాడుతూ కనీస పెన్షన్ రూ. 9వేలు ఇచ్చి, డీఏ జతపరచాలని డిమాండ్ చేశారు. ఈఎస్ఐ ద్వారా వైద్య సదుపాయం కల్పించి, హయ్యర్ పెన్షన్ కోసం హయ్యర్ వేజెస్ దరఖాస్తులను పరిష్కరించాలని కోరారు. రైల్వేలో రాయితీని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఏపీ ఆర్‌పీఏ గుంటూరు జిల్లా కార్యదర్శి కే.బాబు ప్రసాద్ మాట్లాడుతూ 1995లో ప్రారంభించిన ఈ పీ ఎఫ్ పెన్షన్ ఇప్పటికీ సవరించలేదన్నారు. అనంతరం పీఎఫ్ రీజనల్ కమిషనర్ ప్రభుదత్తా ప్రుష్టిని కలిసి వినతి పత్రం అందజేశారు. సభలో ఎన్ఏ శాస్త్రి రాష్ట్ర ఏపీఆర్పీఏ అధ్యక్షుడు కే. గంగాధరరావు, ఆల్ ఇండియా కోఆర్డినేషన్ కమిటీ సభ్యులతో పాటు పోరాటానికి మద్దతు తెలియజేసేందుకు సౌత్ సెంట్రల్ రైల్వే గుంటూరు అధ్యక్షుడు రామచంద్రయ్య, ప్రధాన కార్యదర్శి నరసయ్య , బ్యాంక్ ఎంప్లాయీస్ నాయకులు వి. సాంబశివరావు , జూట్ మిల్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఏ నికల్స్ , ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయీస్ జిల్లా కార్యదర్శి బి. నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.


పీఎఫ్ రీజనల్ కమిషనర్ ప్రభుదత్తా ప్రుష్టికి వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

చింతాయపాలెం పాఠశాలకు స్పోర్ట్స్ ఎక్సలెన్స్ అవార్డు



కర్లపాలెం: మండల పరిధిలోని చింతాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2024–25 సంవత్సరానికి స్పోర్ట్స్ ఎక్సలెన్స్ అవార్డుకు ఎంపికైంది. చింతాయపాలెం పాఠశాల విద్యార్థులు 2024–25 సంవత్సరంలో సుమారు 50 మంది రాష్ట్రస్థాయిలో జరిగిన ఆటల పోటీలలో పాల్గొని బంగారు, రజత పతకాలు సాధించారు. ఈ మేరకు కమిషనర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్, జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం బాపట్ల విద్యాశాఖ కార్యాలయంలో చింతాయపాలెం పీఈటీ ఎం గోపీని డీఈవో ఎస్ పురుషోత్తం శాలువా కప్పి మెమోంటో అందజేసి సన్మానం చేశారు. పీఈటీ గోపీ మాట్లాడుతూ ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల ప్రోత్సాహంతో విద్యార్థులు క్రమ శిక్షణతో ఆటలు ఆడి విజేతలుగా నిలవటం వలన పాఠశాలకు అవార్డు వచ్చిందని తెలిపారు. అవార్డు అందుకున్న పీఈటీ గోపీని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.

ఏఎన్‌యూ దూరవిద్య పీజీ కోర్సులకు నోటిఫికేషన్

అక్టోబర్ 10 వరకు దరఖాస్తుల స్వీకరణ

పెదకాకాని(ఏఎన్‌యూ): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ (సీడీఈ) పీజీ దూర విద్య ప్రవేశాలకు నోటిఫికేషన్ జారీ చేసినట్లు సీడీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ వంకాయలపాటి వెంకటేశ్వర్లు తెలిపారు. 2025–26 విద్యా సంవత్సరానికి సెమిస్టర్ విధానంలో యూనివర్సిటీ గ్రాంట్ కమిషన్ (యూజీసీ), డెబ్ (డిస్టెన్స్ ఎడ్యుకేషన్ బ్యూరో) నుంచి 23 పీజీ కోర్సులకు అనుమతి లభించిందన్నారు. దరఖాస్తుల స్వీకరణ గడువు అక్టోబర్ 10వ తేదీతో ముగుస్తుందన్నారు. కోర్సుల కాల వ్యవధి, విద్యార్హతలు, ఫీజులు తదితర వివరాలను ఏఎన్‌యూసీడీఈ. ఇన్ఫో అనే వెబ్‌సైట్‌లో గానీ, 0863 - 2346222, 98484 77441 ఫోను నెంబర్లను సంప్రదించడం ద్వారాగానీ తెలుసుకోవచ్చు.



ఎంబీఏ, ఎంసీఏ ప్రవేశాలు కూడా...

ఎంబీఏ, ఎంసీఏ ప్రవేశాలకు కూడా షెడ్యూల్ విడుదలైంది. దీని ద్వారా రెండేళ్ల కాలపరిమితితో కోర్సులలో ప్రవేశాలు కల్పిస్తారు. ఈ వివరాలను దూర విద్య కేంద్రం డైరెక్టర్ ప్రొఫెసర్ వంకాయలపాటి వెంకటేశ్వర్లు వెల్లడించారు.

కార్మికులకు న్యాయ విజ్ఞాన సదస్సు

గుంటూరు లీగల్: జాతీయ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాల మేరకు అసంఘటిత రంగ కార్మికులకు న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సయ్యద్ జియావుద్దీన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సయ్యద్ జియావుద్దీన్ మాట్లాడుతూ.. అసంఘటిత రంగంలోని కార్మికులందరూ ఈ– శ్రమ కార్డును కలిగి ఉండాలని తెలిపారు. ఈ కార్డు వలన అత్యవసర సమయంలో వైద్య, ప్రభుత్వ పథకాలకు అర్హులుగా గుర్తించబడి సహాయం పొందుతారని తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా కూడా దరఖాస్తు చేసుకొని, పొందవచ్చని వెల్లడించారు. న్యాయపరమైన సూచనలు చేశారు. తాపీ మేస్త్రీలు, పెయింటర్లు, ప్లంబర్లు, ఎలక్ట్రీషియన్లు, ఆటో డ్రైవర్లు, మెకానిక్‌లు, వీధి వ్యాపారులు కార్డుకు అర్హులన్నారు. కార్యక్రమంలో కట్ట కాళిదాసు ప్యానల్ అడ్వకేట్‌లు, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ హనుమత్ సాయి తదితరులు పాల్గొన్నారు.

ఏఎన్‌యూ డిగ్రీ సెమిస్టర్ ఫలితాలు విడుదల

పెదకాకాని (ఏఎన్‌యూ): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం పరిధిలో జూన్, జూలై నెలల్లో నిర్వహించిన డిగ్రీ 5, 6వ సెమిస్టర్ పరీక్షల ఫలితాలను ఇన్‌చార్జి వీసీ ఆచార్య కె.గంగాధరరావు శుక్రవారం విడుదల చేశారు. 5,454 మంది పరీక్షలు రాయగా 4,292 మంది ఉత్తీర్ణత సాధించారు. రీ వాల్యుయేషన్‌కు సెప్టెంబరు 12లోగా ఒక్కో పేపర్‌కు రూ.1,490 చెల్లించాలని ఏసీఈ వెంకటేశ్వరరావు తెలిపారు. రెక్టార్ ఆచార్య కె రత్నషీలామణి, రిజిస్ట్రార్ ఆచార్య సింహాచలం, డిగ్రీ పరీక్షల కోఆర్డినేటర్ ఆచార్య ఎన్‌వీ కృష్ణారావు, ఎ.రాధాకృష్ణ, డాక్టర్ జ్ఞానేశ్వర్ రెడ్డి, సీఈ శివప్రసాదరావు, నోడల్ ఆఫీసర్ రెడ్డి ప్రకాశరావు, ఏఆర్‌బీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పొలం సర్వే విషయంలో ఘర్షణ

ఒక వర్గానికి చెందిన ఇద్దరికి గాయాలు

అద్దంకి: పొలం సర్వే విషయంలో దాయాదుల మధ్య ఘర్షణ జరిగింది. చక్రాయపాలెం గ్రామంలో శుక్రవారం ఇది చోటుచేసుకుంది. ఒక వర్గానికి చెందిన వారికి ఇద్దరికి గాయాలు కాగా, మరో వర్గానికి చెందిన ముగ్గురిని కిందపడేసి కొట్టారు. వైఎస్సార్ సీపీ సానుభూతిపరుడు జి.సింగారావు తెలిపిన వివరాలు.. మండలంలోని చక్రాయపాలెం గ్రామంలో సర్వే నెంబరు 156/1లో 1.61 ఎకరాల భూమి ఉంది. ఈ భూమిని అరవై సంవ్సరాల నుంచి గ్రామానికి చెందిన గ్రామ సర్పంచ్ గోగులమూడి సింగారావు.. రెవెన్యూ రికార్డులతో అనుభవిస్తున్నాడు. ఈ క్రమంలో సింగారావు తల్లి తులశమ్మకు చెల్లెలు అయిన మస్తానమ్మ పిల్లలు.. ఆ భూమి తమదేనని, ఇటీవల రెవెన్యూ సదస్సుల్లో అర్జీ పెట్టారు. ఈ క్రమంలో శుక్రవారం సర్వేయర్ పొలం కొలతల కోసం వచ్చారు. ఈ క్రమంలో ఇరు వర్గాలకు చెందిన వారు అక్కడకు చేరుకున్నారు. అక్కడి హద్దుదారులను విచారించగా, ఆ భూమిని సింగారావు ఎన్నో ఏళ్లుగా సాగు చేసుకుంటున్నాడని చెప్పారు. ఈ నేపథ్యంలో సింగారావు దాయాదులు జి. రాజకుమారి, జి.మరియమ్మతోపాటు మరో నలుగురు సింగారావు వర్గీయులపై కర్రలతో దాడికి దిగారు. ఈ నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుడు జి. సింగారావు, మరో ఇద్దరు కర్ర దెబ్బల నుంచి తప్పించుకుని అక్కడి నుంచి వెళ్లారు. అయితే ఆ కర్రదెబ్బలు అదే వర్గానికి చెందిన వారికి తగిలాయని, తన కుమారుడు చిరంజీవి ఫోన్‌ను వారు లాక్కుని వెళ్లారని సింగారావు తెలిపాడు. ఇరు వర్గాలకు చెందిన వారు స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స నిమిత్తం చేరారు. తమను సింగారావు వర్గం వారే కొట్టారని గాయపడిన వర్గానికి చెందిన బాధితులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

మాపై కక్షసాధింపు

నేను వైఎస్సార్ సీపీ సానుభూతిపరుడైన సర్పంచ్‌ను కావడంతో టీడీపీ అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి కక్ష కట్టి, మా దాయాదులను పురిగొల్పారు. అరవై ఏళ్ల క్రితం పొలం పంపిణీ జరిగి పాస్ పుస్తకాలు, రెవెన్యూ రికార్డులున్న మా భూమిపై పేచీ పెడుతున్నారు. వారి పేరిట ఆన్‌లైన్‌లో లేకుండా.. రికార్డుల్లో లేకుండా వారి భూమి అనడం అర్జీ పెట్టడం, కొలతలకు రెవెన్యూ అధికారులు రావడం అధికార పార్టీ ఒత్తిళ్లతోనే జరిగింది.

–నగేశ్, సర్పంచ్, (సింగారావు కుమారుడు), చక్రాయపాలెం

సీఆర్‌డీఏ పరిధిలో విద్యార్థులకు ఫీజులో రాయితీలు కల్పించాలి

సీపీఎం డిమాండ్

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్) : రాజధానిలో ఉన్న ప్రైవేటు యూనివర్శిటీలలో సీఆర్‌డీఏ పరిధిలోని విద్యార్థులకు ఫీజులు, ఇతర సౌకర్యాలలో రాయితీ కల్పించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి సిహెచ్ బాబురావు డిమాండ్ చేశారు. గుంటూరు బ్రాడీపేటలోని పార్టీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ల్యాండ్‌పూలింగ్ చట్టం ప్రకారం ఉచిత విద్య, వైద్యం అందించాలని, ప్రభుత్వం ద్వారా రాయితీ వల్ల భూములు పొందిన విద్యాసంస్థలలో ప్రభుత్వ నిబంధనలు పాటించని వాటికి మళ్ళీ భూములు కేటాయించడం సరికాదన్నారు. అలాగే క్యాపిటల్ రీజియన్ పరిధిలో ఉన్న 56 మండలాలలోని విద్యార్థులకు కూడా ఫీజులలో, ఇతర సౌకర్యాలలో రాయితీలు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వై.నేతాజీ, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పాశం రామారావు, కె.నళినీకాంత్, ఎన్.భావన్నారాయణ, ఈమని అప్పారావు, ఎమ్.రవి తదితరులు పాల్గొన్నారు.

రెండు టన్నుల శివ లింగాకారంలో ప్రసాదం

తెనాలిరూరల్: వినాయక చవితి వేడుకల్లో భాగంగా భక్తులు తెనాలిలో శివ లింగాకారంలో ప్రసాదం తయారు చేయించారు. విశాఖపట్నం గాజువాకలోని లంకా గ్రౌండ్స్‌లో లక్ష చీరలతో ఏర్పాటు చేసిన 90 అడుగుల శ్రీ సుదర వస్త్ర మహా గణపతి కమిటీ సభ్యులు తెనాలిలోని మిర్చి స్నాక్స్‌లో భారీ లడ్డూ ప్రసాదం చేయించాలని నిర్ణయించారు. ఇందుకు మిర్చి స్నాక్స్ నిర్వాహకుడు వి.కిషోర్ అంగీకరించి రెండు టన్నుల శివలింగాకార లడ్డూ ప్రసాదాన్ని తయారు చేసి ఇచ్చారు. ఈ ప్రసాదాన్ని శుక్రవారం రాత్రి ఇక్కడ నుంచి గాజువాకకు తరలించారు.



91 మందికి ఉద్యోగ కల్పన

తాడికొండ: ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నైపుణ్యాభివృద్ధి – శిక్షణ శాఖ సౌజన్యంతో తుళ్లూరులోని సీఆర్‌డీఏ స్కిల్ హబ్ ప్రాంగణంలో శుక్రవారం నిర్వహించిన జాబ్ మేళాను పలువురు సద్వినియోగం చేసుకున్నారు. 300కి పైగా ఉద్యోగాలను భర్తీ చేసేందుకు జాబ్ మేళా నిర్వహించగా 301 మంది హాజరయ్యారు. వీరిలో 91 మందికి ఉద్యోగాలు లభించాయని సీఆర్‌డీఏ అధికారులు తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన పలువురు అభ్యర్థులకు ఆయా కంపెనీల హెచ్‌ఆర్ విభాగ ప్రతినిధులతో కలసి సీఆర్‌డీఏ అడిషనల్ కమిషనర్ జి.సూర్యసాయి ప్రవీణ్ చంద్ ఆఫర్ లెటర్లు అందజేశారు. కార్యక్రమంలో ఏపీ ఎస్ఎస్‌డీసీ ప్లేస్‌మెంట్ అధికారి అరుణ కుమారి, సీఆర్‌డీఏ డీసీడీవోట బి. శ్రీనివాసరావు పాల్గొన్నారు.



పుష్కర ఘాట్‌లో మహిళ ఆత్మహత్యాయత్నం

కాపాడిన మత్స్యకారులు


మహిళను బయటకు తీసుకువస్తున్న మత్స్యకారుడు

తాడేపల్లి రూరల్: ప్రకాశం బ్యారేజ్ కృష్ణానది దిగువ ప్రాంతంలోని సీతానగరం పుష్కర ఘాట్ల వద్ద ఓ మహిళ కృష్ణానది వరద నీటిలోకి దిగి శుక్రవారం ఆత్మహత్యాయత్నం చేసింది. ఇది గమనించిన మత్స్యకారులు ఆమెను కాపాడి తాడేపల్లి పోలీసులకు సమాచారం ఇచ్చారు. సేకరించిన వివరాల ప్రకారం.. విజయవాడ భవానీపురంనకు చెందిన నరేంద్రతో ఏడాదిన్నర క్రితం యామినికి వివాహమైంది. గత ఆరు నెలలుగా వారి మధ్య మనస్పర్థలు రావడంతో యామిని భవానీపురంలోని తల్లిదండ్రులు వద్ద ఉంటోంది. భర్త దగ్గరకు వెళ్లగా ఇంట్లో నుంచి బయటకు నెట్టడంతో మనస్తాపం చెంది సీతానగరం పుష్కర ఘాట్ల వద్దకు వచ్చింది. చనిపోవడానికి వరదనీటిలోకి దూకింది. పక్కనే పడవలను భద్రపరుస్తున్న మత్స్యకారులు గమనించి నీటిలోకి దిగి ఆమెను కాపాడారు. సమాచారం అందుకున్న తాడేపల్లి మహిళా పీఎస్ఐ అపర్ణ సంఘటనా స్థలానికి వెళ్లి యామిని తండ్రి శ్రీనివాసరావును పిలిపించారు. ఆమెకు కౌన్సెలింగ్ ఇచ్చి పంపారు.